# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి

**అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సిఇఓ) సి. సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్), ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్ నుండి జిల్లా ఎన్నికల అధికారులు (డిఈఓ), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో (ఈఆర్ఓ)లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సి.ఈ.ఓ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో, వలస జనాభా ఎక్కువగా ఉండే చోట్ల ప్రత్యేక వ్యూహాలను అనుసరించాలని జిహెచ్‌ఎంసి, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. 40 ఏళ్లలోపు వయస్సు ఉన్న మహిళా ఓటర్లను వారి తల్లిదండ్రులతో మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు అందరూ సంబంధిత బిఎల్‌ఓలను (బిఎల్‌ఎల్‌ఓ)లను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు.

### క్షేత్రస్థాయి పర్యవేక్షణ..

గేటెడ్ కమ్యూనిటీలు, మురికివాడల్లో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఆయా అసోసియేషన్‌ల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇందుకోసం ఈఆర్‌ఓలు, ఎఆర్‌ఓలు, బిఎల్‌ఎఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా డిఈఓలు, ఈఆర్‌ఓలు, ఎఆర్‌ఓలు కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్‌పై 'స్వీప్' కార్యక్రమాల ద్వారా జిల్లాల్లో పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అదనపు సిఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ ఎం. మను చౌదరి, జాయింట్ సిఈఓ ఎం. సత్యవాణి పాల్గొన్నారు.

# హైడ్రా ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

**ముఖీం అనుచరుల చేతిలో మోసపోయామంటూ బాధితుల ఆవేదన**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమీన్‌పూర్ పరిధిలోని నిరుపేదలు సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణిలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ మోసగాళ్ల చేతిలో చిక్కుకుని సర్వం కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను వేడుకున్నారు. 'ముఖీం అనుచరులమని చెప్పి మమ్మల్ని నమ్మించారు. వెనుక పెద్ద లాయర్ ఉన్నారని, ఏమీ కాదని భరోసా ఇచ్చి 70 గజాల చొప్పున ప్లాట్లు అమ్మేశారు' అని బాధితులు ఫిర్యాదు చేశారు. కూలీ పనులు చేసుకుంటూ, ఊర్లో ఉన్న కాస్త భూమిని అమ్ముకుని ప్లాట్లు కొన్నామని, తీరా అవి ప్రభుత్వ భూములని తెలియడంతో ఎం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కురుమ మల్లేష్, మాణిక్ యాదవ్, రవి నాయక్, రామచంద్ర నాయక్ తదితరులు ముఖీం అనుచరులుగా చలామణి అవుతూ నోటరీ పత్రాలతో మోసం చేసినట్లు బాధితులు చెప్పారు. డిమాండ్ కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కేవలం అమీన్‌పూర్ మాత్రమే కాకుండా, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రాకు భారీగా వినతులు అందాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బ్లూసీ హోటల్ వెనుక ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి, అక్కడ పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు.

ఔటర్ రింగ్ రోడ్డు కోసం సేకరించిన అసైన్డ్ భూములను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వాటిని అసలు వారికైనా ఇవ్వాలని లేదా ప్రభుత్వమైనా స్వాధీనం చేసుకోవాలని దుండిగల్ వాసులు ఫిర్యాదు చేశారు. మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లో ఎకరం భూమి, బాచుపల్లి సర్వే నెంబర్ 54లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నట్లు శ్రీ శక్తి మహిళా మండలి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. బేగంపేట బ్రాహ్మణవాడిలోని 3 వేల గజాల స్థలం, సైదాబాద్ ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న 4083 గజాల ఓపెన్ ప్లేస్‌ను కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారని వినతులు అందాయి. ఫిర్యాదులను స్వీకరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, తక్షణమే స్పందించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఆయన సూచించారు.

## డిఎస్‌పి నికత్ జరీన్‌కు డిజిపి శివధర్ రెడ్డి అభినందన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ప్రతిష్ఠాత్మక బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించిన డిఎస్‌పి నిఖత్ జరీన్‌ను రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసిన నిఖత్ జరీన్‌ను డిజిపి కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, తెహ్రీ లేక్ వేదికగా ఈ నెల 8 నుండి 12 వరకు నిర్వహించిన '25వ ఆల్ ఇండియా పోలీస్ వాటర్ స్పోర్ట్స్ క్లస్టర్ పోటీల్లోనూ తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. రోయింగ్ కాక్స్‌లెస్ పెయిర్ 500 మీటర్ల విభాగంలో 1వ బెటాలియన్ టీజీఎస్పికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎన్. రామకృష్ణ , సీఏఆర్ సిద్దిపేటకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ జె. రాజు అద్భుత ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని డిజిపి అభినందించారు. అభినందన కార్యక్రమాలలో శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, స్పోర్ట్స్ ఐజిపి గజరావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఆర్వి రామారావు, కోచ్ పి. కృష్ణారావు (హెడ్‌కానిస్టేబుల్, డిఎఆర్ వనపర్తి) తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి వెళ్లిన బిఆర్‌ఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం కమిషన్, ఎంఎల్‌ఎల పార్టీ ఫిరాయింపుల కేసుల నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను నిమ్మితం బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్రలతో కూడిన బిఆర్‌ఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల బృందం సోమవారం ఢిల్లీకి వెళ్లింది. హైకోర్టులో ఈ నెల 22న కాళేశ్వరం కమిషన్‌పైన తుది తీర్పు వెలువడనున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై, అలాగే ఎంఎల్‌ఎల పార్టీ ఫిరాయింపుల అంశంపైన న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపైన త్రిసభ్య బృందం న్యాయవాదులతో చర్చించనున్నారు.

## బిసి గురుకులాల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ

**22నుంచి దరఖాస్తుల స్వీకరణ.. మే 12 చివరి తేదీ: ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి గురుకులాల్లో 2026 27 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 22వ తేది నుంచి మే 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో https://mjptbcwreis.telangana.gov.in లేదా https://mjptbcadmissions.org/MJPInter లో దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియట్‌లో రెగ్యులర్ (ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి, హెచ్ఇసి) గ్రూపులతో పాటు వృత్తి విద్యా (ఒకేషనల్) కోర్సులు (అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ) ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 146 కాలేజీలలో బాలురకు 12,640 సీట్లు, 144 కాలేజీలలో బాలికలకు 12,080 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. బిసి గురుకులాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తమ స్కూల్ ప్రిన్సిపాల్స్ కు దరఖాస్తు ఇస్తే సరిపోతుందని, మరిన్ని వివరాలకు 04023328266 లో సంప్రదించాలని సైదులు సూచించారు.

## సెన్సెస్ శిక్షణ తరగతుల సమయం మార్చండి : టిఎస్ యుటిఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధిక వేడిమి దృష్ట్యా సెన్సెస్ శిక్షణ తరగతులను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. ఈ మేరకు ఆయన టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్‌తో కలిసి తెలంగాణ సెన్సెస్ డైరెక్టర్ భారతి హోలికేరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైబడి ఉంటున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, అందుకే ఉదయం సమయంలోనే శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు.

# దక్షిణ మధ్య రైల్వేకు పిఆర్‌ఎస్‌ఐ అవార్డుల వర్షం

**మీడియా, క్రైసిస్ కమ్యూనికేషన్‌లో ప్రథమ బహుమతులు**

**సోషల్ మీడియా విభాగంలో ద్వితీయ స్థానం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రజా సంబంధాల విభాగం ప్రతిష్ఠాత్మక గుర్తింపు సాధించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్‌ఎస్‌ఐ), హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ రిలేషన్స్ అవార్డ్స్–2026లో ఎస్‌సిఆర్ మూడు విభాగాల్లో అవార్డులు దక్కించుకుంది. బేగంపేటలోని హోటల్ ప్లాజాలో ఆదివారం జరిగిన 4వ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రైసింగ్2047 కమ్యూనికేషన్, ఇన్నోవేషన్, ఎంపోవెర్‌మెంట్ థీమ్‌తో ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో మీడియా రిలేషన్స్, క్రైసిస్ కమ్యూనికేషన్ విభాగాల్లో ఎస్‌సిఆర్ ప్రథమ బహుమతులు గెలుచుకోగా, సోషల్ మీడియా కమ్యూనికేషన్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ అవార్డులను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, సమాచార శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక చేతుల మీదుగా ప్రదానం చేయగా, ఎస్‌సిఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సీనియర్ ప్రొఫెసర్లు ఎం. ప్రదీప్ కుమార్, కె. రాజేష్ స్వీకరించారు. ఎస్‌సిఆర్ ప్రజా సంబంధాల విభాగం మీడియాతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, సమయానుకూల సమాచారం అందించడం ద్వారా విశ్వసనీయతను పెంచుతోంది. ట్రాక్ దెబ్బతినడం, వరదలు, తుఫానులు, పండుగ రద్దీ వంటి అత్యవసర పరిస్థితుల్లో రైళ్ల నడిపింపు, మార్పులు, రద్దులపై తక్షణ సమాచారం అందించడం ద్వారా ప్రయాణికులకు సహాయకారిగా నిలుస్తోంది. అలాగే ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికలను వినియోగిస్తూ రైలు సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి, వినూత్న కార్యక్రమాలపై నిరంతరం అప్డేట్లు అందిస్తోంది. ఈ కృషికి గాను ఎస్‌సిఆర్‌కు ఈ అవార్డులు లభించాయని అధికారులు తెలిపారు.

## తెలంగాణలో ఐటి రంగానికి పునాదులు వేసిన ఘనత చంద్రబాబుదే

**టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నగర నేతలు నల్లెల్ల కిషోర్, పి. బాలరాజ్ గౌడ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా దార్శనిక నాయకుడని కొనియాడారు. హైటెక్‌సిటీ స్థాపన ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ ఐటి పటంలో నిలబెట్టిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఐటి రంగంలో సాధిస్తున్న ప్రగతికి ఆయన వేసిన పునాదులు కీలకమన్నారు. 76 ఏళ్ల వయస్సులోనూ యువకుడిలా శ్రమిస్తూ, దేశ అభివృద్ధి కోసం రూపొందించిన విజన్ 2047 ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. తెలంగాణలో టిడిపి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు కార్యకర్తలు కృషి చేస్తున్నారని, పార్టీ బలానికి నిబద్ధతగల కార్యకర్తలే ఆధారమని నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్ అన్నారు. చంద్రబాబు నాయుడు దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఆయన మార్గదర్శనం కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. శ్యామ్‌సుందర్, కరణం కిరణ్, భాను ప్రకాష్, జగదీశ్ గౌడ్, చంద్రమోహన్ గౌడ్, బి.రాజు, ఆనంద్, సత్తన్న, యాదగిరి పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం లక్ష్మీ దేవిపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, పాల్వంచ మండలం ఉల్వనూరు పంచాయితీలోని కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాను చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ మంత్రి సానుకూలంగా స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రాలు మంజూరు చేశారని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు అమ్మినష్టపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, రైతులకు తూకం, నగదు చెల్లింపుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు కొలగొద్దని, అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ రైతాంగ సంక్షేమం కోసం నిరతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేహామీ ఇచ్చారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో అంగన్ వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు అందించారు. అంగన్వాడీలకు వచ్చే పిల్లలకు చక్కటి పౌష్టికాహారాన్ని అందించాలని, బాలింతలు, గర్భిణీలకు బలవర్ధకమైన ఆహారాన్ని ఇవ్వాలని చెప్పారు. పిల్లల చదువులకు అంగన్వాడీలు తొలిమెట్టు అని, ఆట పాటలతో కూడిన చదువులు అందించాలని సూచించారు. తహశీల్దార్లు శిరీష, దారా ప్రసాద్, ఎంపిడిఓ బొగ్గా నారాయణ, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీ పతి,అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుర్రం వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి బరపటి వాసు, సర్పంచ్‌లు వాసం రుద్ర, కుర్సం రాములు, రాంబాబు, శేఖర్ బాబు, శ్రీనివాసరావు, వైస్ గిరి, గౌతమి కృష్ణ, యాకయ్య, శ్రీను, వజ్జా వ ఆసు, అప్పారావు, రంజిత్, రవి, సోమయ్య ప్రసాద్, స్వర్ణలత, నిమ్మగట్ల వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, పాషా, చింటూ, గోవంద్, మిర్యాల రాము, ప్రసాద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడు సామాజిక న్యాయానికి ప్రతీక

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక విప్లవకారుడు, తత్వవేత్త మహాత్మా బసవేశ్వరుని జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజానికి బసవేశ్వర జయంతి శుభాకాంక్షలు తెలిపారు. బసవేశ్వరుడు కేవలం ఒక వర్గానికే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం ప్రతీకగా కోట్లాది మంది గుండెల్లో నిలిచిపోయారని రాంచందర్ రావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బసవేశ్వరుని ఆలోచనల నుండి స్ఫూర్తి పొందారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా మహిళా సాధికారత, సమానత్వ సమాజ నిర్మాణం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాయకవే కైలాసం అనే బసవేశ్వరుని సందేశం నేటికీ సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. బసవేశ్వరుని ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ శ్రేయస్సు కోసం ముందుకు సాగాలన్నారు.

## కేంద్ర పథకాల అమలుపై ప్రభుత్వానికి ఎమ్మెల్సీ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సోమవారం లేఖలు పంపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుమా రు 15 కీలక పథకాలను ప్రస్తావిస్తూ, అవి తెలంగాణలో క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్, పిఎం ఉజ్వల యో జన, స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్ భారత్, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, పిఎం ఫస ల్ బీమా, ముద్రా యోజన, పిఎం స్వనిధి, జన్ ధన్ యోజన తదితర పథకాల అమలు తీరుపై వివరాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కో సం అనేక పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ, అవి పూర్తిగా అమలు కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. ఈ పథకాలన్నింటినీ రాష్ట్రంలో పారదర్శకంగా అమలు చేసి, అర్హులకు ప్రయోజనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్-బిఆర్‌ఎస్ మధ్య 'ఫిక్సింగ్ పాలిటిక్స్'

**బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు పరస్పర అవగాహనతో ప్రజలను మోసం చేస్తున్నాయని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ ఆరోపించారు. రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ ఒకే రోజు జిల్లాల్లో సభలు నిర్వహించడం యాదృచ్ఛికం కాదని, ముందే ప్రణాళిక చేసిన రాజకీయ నాటకమని విమర్శించారు. ఉత్తర తెలంగాణలో బిజెపి బలపడుతుండటాన్ని అడ్డుకోవడానికే ఈ చర్యలు చేపట్టారన్నారు. కెసిఆర్ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు సిఎం రేవంత్ రెడ్డి కూడా గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన ఆరోపణలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి అంశాలను పూర్తిస్థాయిలో వెలికితీయకుండా కాంగ్రెస్‌బిఆర్‌ఎస్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని వృథా చేస్తూ పర్యటనలు నిర్వహిస్తున్నారని, రైతు హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్‌బిఆర్‌ఎస్ పార్టీల ఫిక్సింగ్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనించాలని, బిజెపి ప్రజాపక్షంగా పోరాడుతుందన్నారు.

## 22 నుంచి ఆదివాసీల 'విజ్ఞాన యాత్ర'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసీ బిడ్డల అభ్యున్నతే లక్ష్యంగా, వారిలో విజ్ఞాన కాంతులు నింపాలన్న పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వినూత్న ఆలోచన ఆచరణలోకి రానుంది. గతంలో ఉట్నూరు మండలం కుమ్మరికుంటలో పర్యటించిన సందర్భంలో, అక్కడి ఆదివాసీలతో ముచ్చటించిన మంత్రి జూపల్లి 'మిమ్మల్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లి, అక్కడి అభివృద్ధిని, చారిత్రక కట్టడాలను చూపిస్తాను' అని హామీ ఇచ్చారు. తన ఆలోచనల నుంచి పుట్టిన వినూత్న కార్యక్రమానికి 'ఆదివాసీ టూ రిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' పేరుతో కార్యరూపం దాల్చనుంది. బుధవా రం ఉదయం 6 గంటలకు ఉట్నూరు మండలం గొందుగూడలో జెండా ఊ పి ఈ విజ్ఞాన యాత్రను మంత్రి జూపల్లి స్వయంగా లాంఛనంగా ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, తారామతి బరాదరి, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు.

## నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం /సిటీ బ్యూరో :** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజులు' లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30గంటలకు ఉర్దూ ముస్కాన్ ఆడిటోరియం ఖిల్వత్‌లో ఏర్పాటుచేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, మైనార్టీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

## ఐహెచ్ఎం వార్షిక అవార్డులు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్‌లో 202526 విద్యా సంవత్సరం వార్షిక అవార్డుల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మాగజైన్ 'క్యాకిల్'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐహెచ్ఎం హైదరాబాద్ ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్, అతిథులు ఇస్కాన్ ఆధ్యాత్మిక గురువు ప్రద్యుమ్న కృష్ణ దాస, ది వెస్టిన్ హైదరాబాద్ మైండ్ స్పేస్ జనరల్ మేనేజర్ దీప్ ప్రీత్ బింద్రా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ఏపి సిఎం చంద్రబాబునాయుడు జన్మదినోత్సవ వేడుకలు తెలుగుతమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తెలంగాణ టిడిపి నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్ తదితరులతో కలిసి పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్యాంసుందర్, కరణం కిరణ్, భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, జగదీష్ గౌడ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఇ వ్యవస్థ బలోపేతానికి కృషి

-లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంఎస్ఎంఇ తరహా పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తుందని.. 28 రాష్ట్రాల్లో 75 వేల మందికి పైగా సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా నిలిచిందన్నారు. సమావేశంలో పాల్గొన్న లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో 13 జిల్లాల్లో విస్తరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఎంఎస్ఎంఈల వాణిని మరింత బలంగా వినిపించడమే లక్ష్యమన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: కొమిరెల్లి రాజిరెడ్డి

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆర్‌టిసి కార్మిక సమాఖ్య రాష్ట్ర నాయకుడు కొమిరెల్లి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్ ఆర్‌టిసి డిపో వద్ద సమ్మెకు సమాయత్తంగా నిర్వహించిన మహాధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మిక సంఘాలతో ఇప్పటివరకు ప్రభుత్వం చర్చలు జరపకపోవడాన్ని ఖండించిన ఆయన, వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని కోరారు. వేతన సవరణలు పెండింగ్‌లో ఉండటం, యూనియన్లకు అనుమతి లేకపోవడం వల్ల కార్మికులపై ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనివార్యమైతే సమ్మెలో సమాఖ్య సభ్యులు ముందుండి పాల్గొంటారని హెచ్చరించారు.

## ఎంఎంటిఎస్‌లో ఉచిత ప్రయాణం ఆమోదయోగ్యం

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ఎంఎంటిఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం సామాన్యులకు ఎంతో మేలు చేస్తుందని గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా తెలిపారు. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, నగరంలో ట్రాఫిక్, కాలుష్యం తగ్గుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ మధ్య జరుగుతున్న చర్చలు సఫలం కావాలని, ఒక మంచి ఆశయం కోసం రైల్వే బోర్డు కూడా ఈ ప్రతిపాదనను సానుకూలంగా అంగీకరించాలని ఆమె కోరారు.

## బంగారు మైసమ్మ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** బంగారు మైసమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్ బంగారు మైసమ్మ ఆలయం నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన వార్షికోత్సవ పూజలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు , శైలేందర్, రవీంద్ర సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులే డ్రగ్స్‌కు తొలిమెట్టు

పోలీసు కమిషనర్ విసి సజ్జనార్
'ఆపరేషన్ సేఫ్ స్కూల్' తనిఖీల్లో
-రూ. 1.10 కోట్ల గుట్కాలు సీజ్
-విద్యాసంస్థల వద్ద విక్రయాలపై 567 కేసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులు, యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ హెచ్చరించారు. విద్యార్థులు, యువతను డ్రగ్స్ ఊబిలోకి నెడుతున్న విద్యాసంస్థల సమీపంలోని పొగాకు ఉత్పత్తుల విక్రయ దుకాణాలపై హైదరాబాద్ సిటీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. విసి సజ్జనార్ ఆదేశాల మేరకు విద్యాసంస్థల పరిసరాలను మాదకద్రవ్యాల రహితంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' లో భాగంగా విస్తృతంగా సోదాలు చేశారు. విస్తృత తనిఖీల్లో రూ.1.10 కోట్ల గుట్కాలు (పొగాకు ఉత్పత్తులు) సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలపై 567 కేసులనునమోదు చేశామని ఆయన తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ వ్యాప్తంగా సాగిన సోదాల్లో జోన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే.. అత్యధికంగా చార్మినార్ జోన్ పరిధిలో 119 కేసులు నమోదు కాగా, రాజేంద్ర నగర్ జోన్ లో 102, గోల్కొండలో 98 కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఖైరతాబాద్ లో 78, సికింద్రాబాద్ లో 64, జూబ్లీహిల్స్ లో 54, శంషాబాద్ జోన్ పరిధిలో 52 కేసులను పోలీసులు నమోమని సజ్జనార్ పేర్కొన్నారు. విద్యార్థుల, యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై పోలీసులు కఠిన చట్టాలను ప్రయోగించారు. పట్టుబడిన ఉత్పత్తులు, దుకాణదారుల నేర తీవ్రతను బట్టి సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లు, జువైనల్ జస్టిస్ (జెజె) యాక్ట్ సెక్షన్ 77తో పాటు 79, ఈసిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.పాఠశాలలు, కళాశాలలు లేదా ఇతర విద్యాసంస్థల సమీపంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా సిగరెట్లు, గుట్కా, ఈసిగరెట్లు లేదా ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని కోరారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ ఫోన్ నంబర్ 8712661601 కు సమాచారం అందించాలని సూచించారు. సుమారు 5 వేల మందికి పైగా పోలీస్ సిబ్బంది ఏకకాలంలో సోదాల్లో పాల్గొన్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు టాస్క్ ఫోర్స్, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ , రిజర్వ్ పోలీస్ ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి..

## పారిపోయిన ఖైదీ అరగంటలోనే పట్టుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రిమాండ్ ఖైదీ ఒకరు పోలీసుల కళ్లముందే వాహనం నుంచి దూకి పరారైన ఘటన నగరంలో సంచలనం రేపింది. అయితే పోలీసులు విస్తృతంగా గాలించి అరగంటలోనే పట్టుకోవడం విశేషం.వివరాలు ఇలా ఉన్నాయి. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు ఖైదీలను మరో కేసు విచారణ కోసం పిటి వారెంట్‌పై సోమవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం వారిని తిరిగి జైలుకు తీసుకెళ్తుండగా, చంచల్‌గూడ జైలు సమీపంలో ట్రాఫిక్ కారణంగా వాహనం ఆగిన సమయంలో నిందితుడు నరేష్ రెప్పపాటులో వాహనం నుంచి దూకి పరారయ్యాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా పోలీసుల్లో కలకలం రేగింది.ఖైదీలను పోలీస్ వాహనం బదులుగా ప్రైవేట్ వాహనంలో తరలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. మిగతా ఇద్దరు నిందితులు మాత్రం పోలీసుల అదుపులోనే ఉన్నారు. ఈ నెల 12న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. కాగా, పరారైన నరేష్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టగా అరగంట వ్యవధిలోనే పోలీసులు అతన్ని చాకచక్యంగా పట్టుకోవడంతో జైలు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

# నీటి పంపింగ్‌లో అంతరాయం

-ప్రజలు సహకరించాలని
జలమండలి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** తాగునీటిని సరఫరా చేసే సింగూర్, మంజీర పంప్ హౌస్‌లు ఉన్న ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గాలి దుమారం, వడగండ్ల వానలు, అకాల వర్షాలు తరచూ సంభవించడం వల్ల చెట్లు విరిగి పడటం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి, నీటి పంపింగ్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోవడం జరుగుతోంది. ఫలితంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఆలస్యమవడం లేదా అంతరాయం కలగడం జరుగుతోంది.ఈ పరిస్థితులు పాత మంజీరా నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. 15 నుంచి 30 నిమిషాలపాటు మాత్రమే కొనసాగే స్వల్పకాలిక విద్యుత్ అంతరాయాలు కూడా మంజీరా వ్యవస్థకు చెందిన పంపింగ్ స్టేషన్ల కార్యకలాపాలను గణనీయంగా దెబ్బతీస్తున్నాయి. ఆదివారం జరిగిన విద్యుత్ అంతరాయం కారణంగా మొత్తం కలిపి సుమారు 7 గంటల పాటు పంపింగ్ నిలిచిపోవడంతో షెడ్యూల్ ప్రకారం జరిగే పనులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ సమస్యలపై జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా స్పందిస్తూ, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుంటూ వెంటనే మరమ్మతు పనులు చేపడుతున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన వెంటనే పంపింగ్ను ప్రారంభించి, నీటి సరఫరా యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బందులు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.సహజ పరిస్థితుల్లో కొంతమేర ఇబ్బందులు తలెత్తడం సహజమని, ప్రజలు దీనిని అర్థం చేసుకుని సహకరించాలని జలమండలి అధికారులు కోరారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** హైదరాబాద్ జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా శ్రీ బసవేశ్వరుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ కదివరన్ పలని మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చిత్రటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

## కులగణనలలో వంజరులకు అన్యాయం



మా సంఖ్యను తక్కువ చేసి
చూపిస్తున్నారు
తెలంగాణ వంజరి సంఘాల ఆక్షేపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో వంజరి కులస్తులు కేవలం 62,897 మంది మాత్రమే ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ కుల గణన పేర్కొనడం పట్ల తెలంగాణ వంజరి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. సికింద్రాబాద్ లోని తార్నాకలో జరిగిన సమావేశంలో వంజరి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 62,000 మంది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 7200 మంది వంజరి కులస్తులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్పడం వంజరి కులస్తులను తక్కువగా చూపించడమేనని తప్పుల తడకగా చూపించి వంజరి కులస్తులను రాజకీయంగా ఆర్థికంగా దెబ్బకొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు . కేవలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వంజరి కులస్తులు 70000 మందికి పైగా ఉన్నారని రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు లక్షలకు పైచిలుకు తక్కువ సంఖ్యలో ఉన్నారని చూపించడం బాధాకరమని అన్నారు. వంజరి కులస్తులను 1978 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌టిల నుండి బిసి డి లోకి అన్యాయంగా మార్చారని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని తెలంగాణలో సవరించాలని పలుసార్లు కోరుతుంటే ప్రభుత్వ శాఖలో ఉన్న కొందరు కుట్రపూరితంగా వంజరి కులస్తులకు అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం, అఖిలభారత వంజరి సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదగని హరినాథ్, నాయకులు ముజకరి రవీందర్ దాత్రిక కాశీనాథ్, ధాత్రిక ధర్మరాజు, కనుకంటి శివప్రసాద్ ఎదుగాని వెంకటేశం ఆముద లక్ష్మ ణ్ కాలేరు సా యి బాబా కాలేరు శ్రీనివాస్ మల్లకు ఆనంద్ కేంద్రీ మురళీకృష్ణ ముజకరి దినేష్‌లు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జనన ధృవీకరణ పత్రాలు అందజేత



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. అమీర్‌పేటలోని శిశు విహార్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సరైన సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని అక్కడి వారికి సూచించారు. చిన్నారులు జనన, కుల ధృవీకరణ పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామకృష్ణ, జాయింట్ డైరెక్టర్ మోతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారమే ఆహార పదార్థాలు

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన
విద్యార్థులతో సహపంక్తి భోజనం



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మహేంద్రహిల్స్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, రెసిడెన్షియల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజులు'లో భాగంగా సంక్షేమ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆమె సూచించారు . కళాశాలలో ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారికి సూచించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామకృష్ణ, ప్రిన్సిపాల్ సునీత, ఇతర అధికారులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలి

- అదనపు కలెక్టర్ కదివరన్ పలని

**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కదివరన్ పలని అధికారులను ఆదేశించారు. వాట్సాప్ దరఖాస్తులను సమీక్షిస్తూ వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రజావాణిలో మొత్తం 556 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో గృహనిర్మాణ శాఖకు చెందినవి 453,ఫించన్లకు చెందినవి 67, రెవెన్యూ శాఖకు సంబంధించినవి 18, ఇతర శాఖలవి 18 ఆర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వడ్డెర్ల జనగణనను సవరించాలి

జాతీయ వడ్డెర సంఘం
జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** రాష్ట్ర కులగణన నివేదికలో వడ్డెర్ల జనగణనను సవరించాలని జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వడ్డెర్లు 15 లక్షల నుంచి 20 లక్షల మంది వరకు ఉంటే కులగణనలో వాస్తవానికి విరుద్ధంగా 5లక్షల 43వేలు మాత్రమే ఉన్నారనడం అన్యాయమన్నారు. బిసి 'ఎ' వర్గంలో 106వ స్థానం, సమగ్ర వెనుకబడిన సూచీలో 225వ స్థానంలో ఉండటం వడ్డెర్ల పరిస్థితేంటో స్పష్టంగా తెలుస్తుందన్నారు. వడ్డెర్లు విద్య, ఉపాధి, రాజకీయరంగాల్లో వెనుకబడ్డారని, ఇందుకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా వడ్డెర పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లపు శివకుమార్, జాతీయ యువజన అధ్యక్షులు వేముల భరత్, నేతలు బోదాసు రవి, మల్లె కృష్ణ, పిట్ల శివకుమార్ తితరులు పాల్గొన్నారు.

## 'పేద న్యాయవాదులకు, జర్నలిస్టులకు గౌరవ వేతనమివ్వాలి'

రాష్ట్ర ప్రభుత్వానికి దశరథ్ నాయక్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** ప్రతిరోజు కోర్టు కు హాజరయ్యే పేద న్యాయవాదులకు, మీడియా లో పని చేస్తున్న జర్నలిస్టులకు గౌరవ వేతనం చెల్లి ంచాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కో రారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆ యన మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. వృత్తిరీత్యా ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్న జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా హెల్త్‌కార్డులు ఇ వ్వాలని విజ్ఞప్తి చేశారు. హోంగార్డు నుంచి ఎస్ఐ స్థాయి పోలీసులకు వారి శ్రమకు తగ్గ వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా వర్షకాలం రాకముందే లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడి వర్షపు వరద నీరు నిల్వకుండా సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలనిచేపట్టాలని కోరారు.

# 'బుద్బుదం' కథల సంపుటి ఆవిష్కరణ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రముఖ రచయిత, కథకుడు ఎం. ఉదయభాను సంస్మరణ సభ సోమవారం వారి స్వగృహమైన జనప్రియ రెవెన్యూ, సత్యానగర్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ప్రచురించిన 'బుద్బుదం' కథల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వామపక్ష మేధావులు, సాహితీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై రచయితతో తమ అనుభవాలను పంచుకున్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు జడ సత్యనారాయణ అధ్యక్షత వహించగా, పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య, ఐఎఫ్‌టియు నేత బూరుగుల ప్రదీప్, ప్రొఫెసర్ టీవీ గోపాలచారి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు గౌని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. వక్తలు తమ ప్రసంగాల్లో రచయిత ఎం. ఉదయభాను తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియకు చేసిన విశేష కృషిని స్మరించారు. ముఖ్యంగా ఆయన రచనల్లో అభ్యుదయ భావా లు, సామాజిక దృక్పథం, మానవీయ విలువలు ప్రతిఫలించాయని తెలిపారు. సమాజంలోని విభిన్న సమస్యలను కథల రూపంలో సజీవంగా ప్రతిబింబిస్తూ పాఠకులను ఆలోచింపజేసే శక్తి ఆయన రచనలకు ఉందని కొనియాడారు.

## జంట హత్యల కలకలం

**ప్రజాపక్షం/చార్మినార్:** జంట హత్యలు పాతబస్తీవాసులను భయభ్రాంతులకు గురిచేశాయి. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే నూరుఖాన్‌బజార్ ప్రాంతంలో అదిల్ ఖాన్ అనే వ్యక్తి అతని సోదరుడు అఖ్వీల్‌ఖాన్, అజ్మీరి బేగం అ నే ఇద్దరిని ఇంట్లో దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న మీర్‌చౌ క్ పోలీసులు, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హ త్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ భూమి కాపాడాలి



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** జంగంమేట్ ఎంసిహెచ్ క్వార్టర్స్ డబుల్ బెడ్‌రూమ్ దగ్గర ఉన్న ఖాళీ స్థలం కబ్జా చేస్తున్న వారిని అడ్డుకుని.. ప్రభుత్వ భూమిని కాపాడాలి బండ్లగూడ ఎమ్మార్వో, ఫలక్‌నుమా సిఐలకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ..... జంగమెట్ డివిజన్‌లోని ఎంసిహెచ్ క్వార్టర్స్‌లో ఉన్న ఖాళీ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఫిర్యాదుచేసిన వారిలో జంగయ్య, కుమార్, సంగీత, లావణ్య, సబిత, రేణుక, స్వర్ణలత, గోషా బేగం, షైన్ బేగం తదితరులు ఉన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే శంకర్



ప్రజాపక్షం/కొందుర్గు: ప్రభుత్వ ఉద్యోగులు సమయవేళలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిషత్ కార్యాలయాలను ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది రికార్డు పరిశీలించగా 19మంది ఉద్యోగులు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే విధుల్లో ఉండటంపై డాక్టర్ అమృత జోసెఫ్‌ను నిలదీశారు. అవుట్ పేషంట్స్ రోజుకు 25నుండి 30మంది మాత్రమే రావడం ఏమిటని ప్రశ్నించారు. వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, డిప్యూటేషన్‌పై షాబాద్ వెళ్ళిన డాక్టర్ కొందుర్గులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే విధులు నిర్వహించాలని సూచించారు. అక్కడ విధులు నిర్వహించి ఇక్కడ జీతం తీసుకోవడం ఏమిటని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 99రోజుల ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు 100శాతం నిర్మించి ఇవ్వాలని, పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, కార్యాలయ సమయవేళలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్ఐ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

## టిఎన్‌జిఒ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: షాద్‌నగర్ తాలుకా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన జక్కుల శ్రీనివాస్, పోలే శ్రీహరిలను టిజెఏసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్‌లో టిజెఏసి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో టిజెఏసి తాలుకా అధ్యక్షుడు ఎం.జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, తాలుకా కన్వీనర్ నక్క బాలరాజ్, ట్రెజరర్ గొర్ల రాము, సిఐటియుసి రాజునాయక్, బాదేపల్లి సిద్ధార్థ, యుటిఎఫ్ బిజిలి సత్యం, భీష్వ కృష్ణయ్య, బెన్నూరి రమేష్, మందారం నరసింహులు, బూర్గుల రఘు, రవీందర్, ఆర్‌టిసి అర్జున్‌కుమార్, ఆర్టిసి నర్సింలు, చంద్రకాంత్, సుధాకర్ గౌడ్, రాజుగౌడ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

## ఉపాధికూలీలకు మెడికల్ కిట్టు పంపిణీ



ప్రజాపక్షం/యాచారం : పని అడిగిన ప్రతి నిరుపేదకు పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని యాచారం ఎంపిడిఒ రాధరాణి అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి లతో కలిసి ఉపాధి కూలీలకు మేడికల్ కిట్టు, ట్యాబ్లెట్లు పంపిణి చేశారు. ఈ సంధర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కూలీలందరు ఉపాధి పనిని ప్రభుత్వం అదేశించిన విధంగా పనులు చేయాలన్నారు. కూలీలందరికి సకాలంలో కూలీ డబ్బులు చెల్లించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లో పనులు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ సరఫరా చేయాలన్నారు. గామాల్లో నర్సరీలు ఎండిపోకుండా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రభుత్వ హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిచాలని ఎంపిడిఒ రాధరాణి ఆదేశించారు. సోమవారం మహేశ్వరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు.

## నాణ్యమైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బియన్‌రెడ్డి నగర్ డివిజన్ శ్రీపురం కాలనీ ఫేస్2లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రిలైఫ్ రిహాబిటేషన్ సెంటర్‌ను సోమవారం బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికి నాణ్యతమైన వైద్యం అందించి ప్రజల మన్ననాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిహాబిటేషన్ యజమానులు పార్టీ నాయకులు నరేష్ యాదవ్, శేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహిందు కళాశాల యాజమాన్యంపై చర్యలకు ఎఐవైఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : శ్రీ హిందు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తిసుకోవాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ హిందు కళాశాల యాజమాన్యం వేధింపులతో అదే కళాశాలకు చెందిన బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న ప్రణీత్(22) అనే విద్యార్థి యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వక పోవటంతోనే తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతంలో ఉన్న గురునానక్, భారత్, శ్రీదత్త వంటి ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యలు ఫీజుల పేరిట వేధిస్తున్నా అధికారులు తనిఖీలు చేయటంలో విఫలం చెందారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామడంలి అధికారులు స్పదించి యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులను ఫీజుల కోసం వేధించే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించ కుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 27 ఫిర్యాదులు

### ఫిర్యాదులు స్వీకరించిన కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సుమారు 27 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చి తమ విన్నపాలను అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (అడ్మిన్) కె.సత్యనారాయణ, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) ఎన్.రవి కిరణ్, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, భూస్వాధీనం విభాగానికి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి, యుబిడి డైరెక్టర్ వి.వెంకటేశ్వర్‌రావు, జాయింట్ కమిషనర్(అడ్మిన్) ఎస్.జయంత్, జాయింట్ కమిషనర్ (రెవెన్యూ) జి.రాజనీకాంత్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజల నుండి వచ్చిన వివిధ ఫిర్యాదులను అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు సూచనలు జారీ చేశారు.

### ఎంఎంసిలో 27 వినతుల స్వీకరణ

ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించే లక్ష్యంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. మొత్తం 27 వినతిపత్రాలు అందగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ పరిష్కారం కోసం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని, సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో...

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 43 ఫిర్యాదులు నమోదు అయ్యాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ శాఖకు 24, ఇంజనీరింగ్‌కు 7, ఫైనాన్స్, అకౌంట్స్‌కు 4,





అర్బన్ బయోడైవర్సిటీకి 3, రెవెన్యూ శాఖకు 2, చెరువులు, పారిశుద్ధ్యం, వెటర్నరీ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు చొప్పున నమోదయ్యాయి. కార్పొరేషన్ కమిషనర్ శృజనతో పాటు ఉన్నతాధికారులు ప్రజలతో మాట్లాడి ఫిర్యాదులను పరిశీలించారు. సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులను వెంటనే స్వీకరించడం, ఎస్ఎల్ఏలోపు పరిష్కారం, శాఖల మధ్య సమన్వయం, పునరావృతం కాకుండా పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పౌరసేవలను మరింత బలోపేతం చేయాలని కమిషనర్ శృజన ఆదేశించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ తెలిపారు.

## మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో మహిళా సాధికారత దిశగా మరో కీలక అడుగు పడింది. 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యుల కోసం ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని యుసిడి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో విస్తృత స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్లు పాల్గొని మహిళలకు వివిధ సంక్షేమ, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి పథకాలపై వివరించారు. స్వయం ఉపాధి అవకాశాలు, తక్కువ వడ్డీ రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడే పథకాలపై స్పష్టత ఇచ్చారు. డిసిలు, ఏఎంసిలు, డిపిఓలు, సిఓలు, ఆర్‌పిలు చురుకుగా పాల్గొని మహిళా సంఘ సభ్యులతో పరస్పర చర్చలు జరిపి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి మహిళా సంఘాల నుంచి మంచి స్పందన లభించగా, ఈ అవగాహన తమ జీవనోపాధి అభివృద్ధికి ఉపయోగపడుతుందని సభ్యులు తెలిపారు. యుసిడి విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మహిళా సాధికారతకు కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించనుందని అధికారులు చెప్పారు.

## ఖాళీ స్థలాల డిజిపిఎస్ మ్యాపింగ్ పూర్తిచేయాలి

### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శృజన

ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ శృజన సోమవారం సమీక్షా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జోనల్ కమిషనర్లు, చీఫ్ ఇంజనీర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పౌర సేవల పురోగతిపై సమీక్షించారు. పారిశుద్ధ్యం, ఎంటమలాజి, ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ వసూళ్లు, ఇంజనీరింగ్ పనులపై ప్రధానంగా చర్చ జరిగింది. పనుల అమలులో కాలపరిమితి పాటించడంపై కమిషనర్ దృష్టి సారించారు. ఫాగింగ్ యంత్రాలను వారం రోజుల్లో అందుబాటులోకి తేవాలని, టెండర్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల డిజిపిఎస్ మ్యాపింగ్‌ను 2,3 నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఫిర్యాదుల పరిష్కారానికి 24 గంటల్లో కాల్, 48 గంటల్లో ఫీల్డ్ విజిట్, 72 గంటల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ పనుల్లో పూడికతీత పనులను ఈనెల 30లోపు పూర్తి చేయాలని, గుంతల మరమ్మతులను జూన్ 2లోపు ముగించాలని గడువులు విధించారు. నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు ప్రతిపాదించాలని సూచించారు. వీధిదీపాల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రెవెన్యూ వసూళ్లపై రోజువారీ పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. సైబరాబాద్ వ్యాప్తంగా మెరుగైన పౌర సేవలందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ శృజన సూచించారు.

## హాస్టళ్లను తనిఖీ చేసిన అధికారులు





ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ చిల్కూరులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను, అదేవిధంగా రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి జె.రామారావు, హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని సోమవారం వేరువేరుగా సందర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల హాస్టల్, రెసిడెన్షియల్ పాఠశాలలలో వంటగది, పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి, వంటగది, భోజనశాలలు, హాస్టల్ ప్రాంగణాల తనిఖీ చేశారు. వంట పాత్రలు, నిల్వ ప్రదేశాలు, పరిసరాలను శుభ్రపరచడంతోపాటు ఆహార నాణ్యత, నిల్వ పద్ధతులు, పరిశుభ్రత, సురక్షిత వంటపై సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు సురక్షిత తాగునీరు మురుగునీటి పారుదల తనిఖీ మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఉన్నతధికారులు పలు సూచనలు చేశారు.

## ఎండల తీవ్రత ఉన్నందున తగు జాగ్రత్తలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రస్తుతం వేసవి కాలం జిల్లాలో ఎండ తీవ్రత ఉన్నందువలన తగు జాగ్రతలు తీసుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో వేసవి తీవ్రత నేపథ్యంలో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, వేసవికాలంలో మధ్యాహ్నం సమయంలో అత్యవసర పరిస్థితులు లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. బయటకు వెళ్లే సందర్భంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హీట్‌వేవ్ ప్రభావం వల్ల అలసట, తలనొప్పి, వాంతులు, చెమటలు ఎక్కువగా పట్టటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. కూలీలు, కార్మికులు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పనులు నిర్వహించుకోవాలని, సంబంధిత అధికారి తగిన చర్యలు తీసుకోవాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో షెడ్లు, తాగునీరు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారికి సూచించారు. జిల్లాలోనీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ హాస్పటలలో డాక్టర్లు సిబ్బంది మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వేసవి కాలమైనందున అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బసవేశ్వరుడు గొప్ప సంఘసంస్కర్త

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : సమాజంలో కులవ్యవస్థ, వర్ణ వివక్ష, లింగ వివక్షలను వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మా బలవేశ్వరుడు అని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి కొనియాడారు. మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా సోమవారం వనస్థలిపురంలోని డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఉన్న మహాత్మా బసవేశ్వరుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బసవేశ్వరుడు చేసిన సేవలు అపారమన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం వీరశైవ లింగయాత్ సమాజం అధ్యక్షులు దీపావళి శ్రావణ్ కుమార్, చింతల రవికుమార్ గుప్తా, ముద్దగౌని సతీష్ కుమార్‌గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### సమాజ అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు



షాబాద్: సమాజ అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడని చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, హోప్ పౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్‌తో కలిసి బసవేశ్వరుని విగ్రహాన్ని అవిష్కరించారు. అనంతరం విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహత్మ బసవేశ్వరుడు సమాజంలో సమానత్వం, సత్యం, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు గుండాల అశోక్, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప, లావణ్య, యాదిరెడ్డి, నాయకులు తమ్మలి రవీందర్‌రెడ్డి, మల్లిఖార్జున్, వెంకట్ యాదవ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### గొప్ప అభ్యుదయవాది..

షాద్‌నగర్: మహాత్మా బసవేశ్వరుడు గొప్ప అభ్యుదయవాదని, ఆయన అడుగు జాడల్లో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లో బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని పేర్కొన్నారు. కుల వ్యవస్థ, అంటరానితనం అనే అందకారాన్ని రూపు మాపడానికి ధైర్యంగా పోరాడిన వ్యక్తి బసవేశ్వరుడు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, వీరశైవ సమాజం అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ కుమార్, నాయకులు విశ్వం, కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, అశోక్, పెంటయ్య, నేతలు మార్గం రాజేష్, పట్వారి శ్రావణ్‌కుమార్, సంతోష్, అగ్గనూరు రవిజేత, సాయికుమార్, విశ్వనాథ్, మల్లిఖార్జునప్ప, కత్తి చంద్రశేఖర్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ : మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని హుడా కాలనీ హోప్ పౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకలలో శేరిలింగంపల్లి ఎమ్యేల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ, బుచ్చిరెడ్డి, హోప్ పౌండేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## చలో జగిత్యాల..



ప్రజాపక్షం/బోడుప్పల్:అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం రెండున్నరేళ్లలోనే తెలంగాణను తిరిగి వెనక్కి నెడుతోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మన తెలంగాణను కాపాడుకోవాలంటే కేసీఆర్ నాయకత్వమే మార్గమని పిలుపునిచ్చారు.జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్రకు శ్రీకారం అనే నినాదంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకుడు మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్న సందర్భంగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, ఆకుల మధుకర్, యాసారం శ్రీనివాస్, మునికింట్ల కిరణ్ గౌడ్, గడీల జగన్ రెడ్డి, పింగళి జోగిరెడ్డి బుల్లెట్ శంకర్, మల్లం వెంకటేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి, కిరణ్ నాయక్, సురేష్, వెంకటయ్య, రాము, చక్రి, విక్కీ, రాకేష్ రెడ్డి, రాజు తదితరులు భారీ ఎత్తున తరలి వెళ్లారు.

## నకిలీ పత్రాలతో కుల సర్టిఫికెట్ పొందిన మహిళ అరెస్టు

ప్రజాపక్షం/చర్లపల్లి: నకిలీ పత్రాలతో కుల ధృవీకరణ పత్రం పొందిన మహిళ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.కుసాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో19 మే 2025న న్యూబోయిగూడ సికింద్రాబాద్‌కు చెందిన నారాయణ గోపికృష్ణా అనురాధ(42)అనే మహిళ ఉద్దేశ్యపూర్వకంగా నకిలీ ఆధార్,కరెంట్ బిల్లులతో కులం ఎస్‌సి(మాల) సర్టిఫికెట్ పొంది అధికారులను మోసం చేసిన మహిళను అప్పటి కాప్రా తహసీల్దార్ టి సుచరిత ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి కుషాయిగూడ పిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న ఆమెను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.

## అక్రమ ఆయుధాల స్వాధీనం నిందితులు అరెస్ట్



ప్రజాపక్షం/దుండిగల్ :అక్రమ ఆయుధాల కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ దూలపల్లి లో జరుగగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డీసీపీ కోటి రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం నుండి దూలపల్లి ప్రాంతానికి అక్రమ ఆయుధాల తరలించారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పెట్ బషీరాబాద్ పోలీస్ లు శేరిలింగంపల్లి ఎస్ ఓ టి పోలీస్ ల బృందం దూలపల్లి లోని వికాస్ ఇండియన్ గోడౌన్ లో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుండి ఒక 7.65 ఎం ఎం పిస్టల్,ఎనిమిది ప్రత్యేక రౌండ్లు, రెండు ఖాళీ పత్రికలు దొరికాయి. లైసెన్స్ లేకపోవడంతో తమదైన సైలోల్లో విచారించారు. నింధితులు బీహార్ రాష్ట్రం రోహస్తస్ జిల్లాకు చెందిన వికాస్ కుమార్(22), దూలపల్లి గ్యాస్ గోదాంలో దినసరి కూలీ, వంశ రాజ్ రామ్ (31)డ్రైవర్ లు నేరాన్ని ఒప్పుకున్నారు. ఆయుధాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు దిగుమతులు చేసుకోవాలి




ప్రజాపక్షం /వికారాబాద్ :వరిధాన్యం కొనుగోలుపై మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రబీ2025 26 వరిధాన్యం కొనుగోళ్ల విషయమై మిల్లర్లు వెంటనే ధాన్య దిగుమతులు చేసుకోవాలని ,సరపడా హమాలీలను వెంటనే నియమించి ,దిగుమతులు ,వెంటనే జరిగేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వం సియంఆర్ గడువు పొడిగిస్తు ,డెలివరీకి అనుమతించినందున, వెంటనే రబీ సిఎంఆర్ డెలివారీ చేయాలని సూచించారు. సన్న రకం ,దోడ్డు రకం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈనెల 27నుండి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద వటర్ ,టెంట్లు వేయకుండా కర్రలతో పోరక ను ఉపయోగించుకోవలని తెలిపారు. అవసరమైన సమగ్రిను ఏర్పాటు చేయాలని తెలిపారు.

## టౌన్‌షిప్‌లో స్కేటింగ్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : సింగపూర్ టౌన్‌షిప్ సొసైటీలో స్కేటింగ్ సాధన చేయడానికి సరైన సదుపాయాల కొరకు ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలో సింగపూర్ టౌన్‌షిప్ సొసైటి వారు స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు.ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమానికి పోచారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షులు కర్రే రాజేష్,ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్,ఎస్సీసెల్ అధ్యక్షులు ఎర్ర రాజు,మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్,సహదేవ్ గౌడ్,సింగపూర్ టౌన్‌షిప్ కమిటి సభ్యులు వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ,సెక్రటరీ ఇందిరా ప్రియదర్శిని,రాజేష్ ముదిరాజ్, బద్దం వెంకటరెడ్డి,చామల శ్రవణ్ కుమార్ రెడ్డి,మెట్టు నరసింహారెడ్డి,కొంతం శంకర్ రెడ్డి,మల్లిఖార్జున్ రెడ్డి,నరేష్ గౌడ్,కృష్ణ నాయక్,సయ్యద్‌జాఫర్,విజయ్ రెడ్డి,రమేష్,రవీందర్,మహిళా నాయకురాలు లక్ష్మి ,ప్రవీల,తదితరులు పాల్గొన్నారు.

### రామాలయం - బాబాగూడ

# బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు

రోడ్లు భవనాల శాఖ మంత్రి
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని
కలిసిన అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్
కమతం శిరీషా కృష్ణారెడ్డి
రూ. 2.5 కోట్ల నిధులు మంజూరుకు మంత్రి
వెంకట్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్



ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ గ్రామంలోని రామాలయం బాబాగూడ మధ్యలో బ్రిడ్జ్ నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. 2.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. సోమవారం అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నగరంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జ్ నిర్మాణానికి మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఈ బ్రిడ్జ్‌కు అవసరమైన రెండున్నర కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్‌లో మున్సిపల్ ఎన్నికల సమయంలో మంత్రి వెంకట్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా నిధులు మంజూరు చేసిన మంత్రి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు మారిన బ్రిడ్జ్ నిర్మాణాన్ని ఏ నాయకుడు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని బ్రిడ్జ్ నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టబోతున్నామని చెప్పారు. ఈ బ్రిడ్జ్ నిర్మాణంతో శామీర్‌పేట మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సజావుగా సాగుతాయని చెప్పారు. వర్షాకాలంలో వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయేవని ప్రస్తుతం బ్రిడ్జ్ నిర్మాణంతో రైతులకు, ప్రజలకు, ఉద్యోగులకు రాకపోకలకు అంతారాయం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముద్దం సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలియాబాద్ మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## వసతి గృహాలలో పారిశుద్ధ్యం ,నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ దీపక్‌తివారి



ప్రజాపక్షం/వికారాబాద్:వసతి గృహాలలో పారిశుద్ధ్యం నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలిఅని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. 99రోజుల ప్రజా పాలనల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు ,వసతి గృహాల వంట గదులు ,పరిసరాల పరిశుభ్రత ,పారిశుద్ధ్యం నిర్వహణ ,ఆహార నాణ్యతపై అవగాహన కింద సోమవారం జిల్లా కేంద్రంలోని ఉన్న ఎస్‌సి ,బిసి బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. వంట విధానం ,వంట తయారీ ప్రక్రియను పరిశీలించి ,మెనూ ప్రక్రియను పరిశీలించి ,మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను అదేశించారు. ఈకార్యక్రమంలో ఎస్‌పి వేల్పర్ అధికారిజయపాల్‌రెడ్డి ,మాధవరెడ్డి,తదితరులుపాల్గొన్నారు.

**ప్రజావాణికి 125 దరఖాస్తులు :**ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి 125 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని వేగంగా పరిష్కరించలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు జెడ్‌పిసిఇఒ సుధీర్ , ఆర్‌డిఒ వాసుచంద్ర పాల్గొన్నారు.

ర్వైకల్ క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యగా వ్యాక్సిన్‌పై విద్యార్థులకు ,తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి ,జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి , కొన్ని రకాల క్యాన్సర్‌లను ముందస్తు చర్యల ద్వారా నివారించడం సాధ్యమవుతుందని ముఖ్యంగా ఎచ్‌పివి వంటి కారణంగా వచ్చే వ్యాధులను నిరోధించేందుకు అందుబాటులో ఉందని ,అలాగే బివైరస్ కారణంగా లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్నితగ్గిండానికి తీసుకోవడం చాల అవసరమన్నారు. 14సంవత్సరాలు దాటి 15 సంవత్సరాల లోపు ఉన్న అమ్మాయిలకు ఈవ్యాక్సిన్ వేయబడుతుందన్నారు. ప్రస్తుతము జిల్లాలోని బాలికల ప్రభుత్వ రెసిడిన్షియల్ పాఠశాలలో చదువుచున్న 14నుండి 15మధ్య వయస్సు ఉన్న బాలికలకు వెంటనే వ్యాక్సిషనేన్ చేయాలని అధికారులను అదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ , జెడ్‌పిసిఇఒ సుధీర్ , జిల్లా వైద్యఆరోగ్యశాఖ అదికారి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

## ఈకో టూరిజం వల్ల అనంతగిరి రూపురేఖలే మారబోతున్నయ్

పర్యాటకులకు ఆహ్లాదకరమైన
వాతావరణాన్ని కల్పించేందుకు పెద్ద
మొత్తంలో పనులు
స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రజాపక్షం /వికారాబాద్ :ఈకోటూరిజం వల్ల అనంతగిరి రూపురేఖలే మారబోతున్నాయని పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు మొత్తంలో పనులు చేపట్టడం జరుగుతుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం అనంతగిరి గుట్టలో ఈకో టూరిజం అభివృద్ధిలోఅనంతగిరి ఈకో అర్బన్ పార్క్ ,అనంతగిరి కొండల వీక్షణ గోపురం ,అనంతగిరిపర్యావరణ పట్టణ ఉద్యాన వనము ,అటవీ అతిథి గృహంలో డెక్కన్ ఫుడ్స్ అండ్ టైల్స్ దీబ్రీజ్ ను అటవీ కన్సర్వేటర్లు ప్రియాంక వర్గీస్ ,సునీత భగవత్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ,మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్యతో కలిసి ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ అనంతగిరి ప్రాంతాన్ని పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వల్ల వికారాబాద్ దశలవారీగా అభివృద్ధి వల్ల వికారాబాద్ దశలవారిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకో టూరిజం వల్ల పరిసర ప్రాంతానికి పెద్ద మొత్తంలో వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న పనులన్నింటిని త్వరితగతిన చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరంమూసీ నది జన్మస్థల ప్రాంతాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈటవీ శాఖ అధికారి .జ్ఞానేశ్వర్ , మర్కెట్ కమిటీచైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌పై ఆరోపణలు

ప్రజాపక్షం/నవాబుపేట్ :గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ప్రధానంగా చెత్త తరలింపు, నీటి సరఫరా,అభివృద్ధి పనుల కోసం ఉపయోగించాల్సి ఉండగా, సర్పంచ్ దాన్ని తన అనుచరుల వెంచర్ పనులకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామపంచాయతీకి చెందిన ట్యాంకర్ ట్రాక్టర్‌ను వ్యక్తిగత అవసరాల కోసం, ముఖ్యంగా వెంచర్ ప్రాంతంలో పనులకు వినియోగిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ ప్రధానంగా చెత్త తరలింపు, నీటి సరఫరా, అభివృద్ధి పనుల కోసం ఉపయోగించాల్సి ఉండగా, సర్పంచ్ దాన్ని తన అనుచరుల వెంచర్ పనులకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇంతకు ముందు ఓ గ్రామంలో కూడ ఇలాంటి సంఘటనను అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం, ట్యాంకర్ ద్వారా వెంచర్‌లో నీటి సరఫరా చేయడం, మట్టి తరలింపు వంటి పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీని వల్ల గ్రామంలో అవసరమైన సేవలు ప్రభావితమవుతున్నాయని వారు అంటున్నారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై మండల అధికారులు విచారణ ప్రారంభించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం

ప్రజాపక్షం/జవహర్ నగర్:పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని గబ్బిలాలపేట లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి మాట్లాడారు. మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి గూడు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం గతంలో ఇందిరా గాంధీ హయాంలో పేదలకు ఏ విధంగా మేలు జరిగిందో, నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అదే స్ఫూర్తితో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాసగుప్త మాట్లాడుతూ, అర్హులందరికీ న్యాయం రాజకీయాలకు అతీతంగా, నిజమైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి సదానంద్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ నరసింహా గౌడ్, దొంతగాని కోటేష్ గౌడ్, మాట్ల వినయ్ కుమార్, గజ్వేల్ శంకర్, భాస్కర్, మబ్బు అంజయ్య, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కష్టమర్లను మోసం చేస్తున్న ఉద్యోగిని వెంటనే తొలగించాలి...!

ప్రజాపక్షం/నవాబుపేట్ :కెనరా బ్యాంకులో వ్యవహారాల ప్రతినిధిగా పనిచేస్తున్న రాజా మొల్ల భాస్కర్ ను విధుల నుండి వెంటనే తొలగించాలని గ్రామ సర్పంచ్ దాన నర్సిములు, గ్రామస్తులు డిమాండ్ చేస్తు కెనరా బ్యాంక్ మేనేజర్ కు పిర్యాదు చేశారు. సోమవారం నవాబుపేట మండలంలోని పుల్ మామిడి గ్రామానికి చెందిన రాజామొల్ల భాస్కర్ తండ్రి మానేయ్య గత కొన్ని సంవత్సరాలుగా కెనరా బ్యాంక్ పుల్ మామిడి శాఖ (సిఎన్ఆర్బి 0001597) లో పనిచేస్తు బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల వద్దా తమ యొక్క అకౌంట్లో ఉన్న నగదును చూసి వెసులుబాటును ఆసరాగా చేసుకుని వారితో బ్యాంకు యందు ఫిక్స్ డిపాజిట్ చేస్తే వడ్డీ తక్కువగా వస్తుందని, నేను అంతకుమించి రెట్టింపు వడ్డీ ఇప్పిస్తానని నమ్మబలికి ఖాతాదారులకు, గ్రామస్తులకు ఆశ చూపి మోసం చేయడం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. అందువలన ఖాతాదారులదృష్ట, గ్రామస్తుల శ్రేయస్కారం దృష్ట ఇట్టి విషయంపై ఇంతకుముందు పలుమార్లు రాజమొల్ల భాస్కర్ పై గ్రామస్తులు ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ దాన నర్సిములు అన్నారు. అందువలన బ్యాంకుకు వచ్చి లావాదేవీలు జరుపుకునే కష్టమర్ల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని రాజా మొల్ల భాస్కర్ ను విధుల నుండి తక్షణమే తొలగించాలని బ్యాంక్ మేనేజర్ కు పిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాన నర్సిములు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విరిగిన చెట్లను తొలగించి, కొత్త స్తంభాల ఏర్పాటు

బిఆర్ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద

ప్రజాపక్షం/ నిజాంపేట్: ఈదురు గాలులకు విరిగిన చెట్లను తొలగించి కొత్త స్థంభాలను వేయిస్తానని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 2, సాయిబాబా నగర్‌లలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురు గాలులు, వర్షానికి చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద సోమవారం పలు బస్తీలలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నేలకొరిగిన స్థంభాలను, విరిగిన చెట్లను తక్షణమే తొలగించాలని అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ స ంద ర్భంగా వివేక్ మాట్లాడుతూ ఆకస్మాత్తుగా వచ్చే ఈ దురు గాలులకు చెట్లు విరిగిపోవడం, విద్యుత్ పరంగా ఆటంకాలు కలుగుతాయని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్తీల్లో విరిగిన పడిన చెట్లను తొలగించి నేలకొరిగిన స్థంభాలను తొలగించి నూతన స్థంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

**గాజులరామారంలో బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు...**

గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలో శ్రీ బసవేశ్వర మైత్రి సేన, కర్ణ భక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సుభాష్ నగర్‌లో కర్ణబత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరారం డివిజన్ టీఎస్‌ఐఐసి చౌరస్తాలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని బసవేశ్వర మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ వివక్షలకు తావులేని సమాజ స్థాపన కోసం పోరాడిన యోధుడు బసవేశ్వరుడని అన్నారు. సమానత్వం, న్యాయం ఇవే మనకు బసవేశ్వరుడు చూపిన మార్గాలని చెప్పారు. మనిషి జాతి అంతా ఒక్కటే అనే భావనతో జీవించిన మహానుబావుడు బసవేశ్వరుడని, బసవేశ్వరుడు చూపిన బాటలో ప్రతిఒక్కరు నడవాలని సూచించారు.మాజీ కార్పొరేటర్లు సురేశ్ రెడ్డి, సత్యనారాయణ, సంఘం నాయకులు తమ్మా రామచంద్ర మూర్తి, సూర్య చందర్ రావు, మల్లిఖార్జున్ రావు, మల్లేశ్వర్ రావు, దాన శివాజీ, గణేశ్, నాగభూషణం, సత్యనారాయణ, వీరబోజు బస్వరాజు, గజ్వేల్ భద్రప్ప, కుప్పునూరి వీరేశం, అవుటి రమేశ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాపక్షం/ఉప్పల్:ఉప్పల్ జోన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎంఎంసీ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సోమవారం పరిశీలించారు. చిలుకనగర్, బీరప్పగడ్డ, ఉప్పల్ వార్డుల్లో జరుగుతున్న రహదారి, డ్రైనేజ్ మరియు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనుల పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధి, డ్రైనేజ్ వ్యవస్థల మెరుగుదల, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం వంటి పనులు నాణ్యతతో పాటు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి కావాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను ముందుగానే పూర్తి చేయాలని, నీటి నిల్వలు మరియు వరద సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, అభివృద్ధి పనులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా వేగవంతంగా నిర్వహించాలని, అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల విజయానికి ప్రజల సహకారం కీలకమని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పేర్కొన్నారు.

## పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పరిశుభ్రత ప్రమాణాలను పాటించటంలో అన్ని కోణాల్లో జాగ్రత్తలు తీసుకోవటం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా మైనార్టి సంక్షేమాధికారి కాంతమ్మ అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ బాలికల మైనార్టి స్కూల్‌లో ఆమె తనిఖీ చేసి అక్కడి వంట గదులు, వంట పదార్థాలు నిలువ చేసే గది. వసతి గదులన్నింటిలో ఏ విధంగా పరిశుభ్రత ఉందన్న విషయాన్ని అడుగడుగునా పరనిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు నిత్యం వినియోగించే బాత్రూంలు, మరుగు దొడ్లు, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దీని కోసం అవససరమైన నీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

## ప్రజావాణిలో 103 అర్జీలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 103 అర్జీలను ధరఖాస్తుదారులు సమర్పించారు. కలెక్టర్ మనుచౌదరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఇతర జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాధికారులతో కల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

## కార్మికుడికి గ్రాట్యూటీ డబ్బులు ఇప్పించిన బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు

ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్:కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని ఫ్యాన్ కంపెనీలో గత ఆరు సంవత్సరాలుగా నాగేశ్వరరెడ్డి పనిచేస్తూ వచ్చాడు. ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండానే కంపెనీ యాజమాన్యం అతన్ని ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో నాగేశ్వరరెడ్డికి రావలసిన గ్రాట్యుటీ మొత్తం రూ.30.000 చెల్లించాల్సి ఉండగా, పలుమార్లు అడిగినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిరాశ చెందిన అతను తోటి కార్మికుల సూచనతో బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవిని కలిసి తన సమస్యను వివరించాడు. వెంటనే రవి కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపారు. చర్చల ఫలితంగా నాగేశ్వరరెడ్డికి రావల్సిన గ్రాట్యూటీ రూ.30.000 చెల్లించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

